# పెంకిపిల్ల

"ఇదిగో బజారు—వెళుతున్నా"

"ఉండండీ—వొస్తూంటే"

"ఊఁ((—తొందర...."

".... .... .... ...."

"ఏవాళిటికీ రాకపోతే ఎల్లా? వెళుతున్నా"

"వొస్తుంటే ఇదేమి చోద్యమండీ"

"పసారాలోంచి సావిట్లోకి యింత ఆలస్యమేం?"

"ఫర్లాంగు దూరం బజారుకు ఇంత తొందర ఎందుకండీ"

"ఏం తెమ్మన్నావూ"

"మీకేం కావాలో నాకేం తెలుసమ్మా"

"తెచ్చిన వాటికి పేర్లు పెట్టవు కద—"

"అవును కానీండీ—పేర్లు పెట్టనివి కాస్త చూచి తేరాదూ"

"ఇంతకీ పెడసరి వాటం—వెళుతున్నా"

"అంత తొందర ఎందుకండీ—"

"గుళ్ళోకి పోవాలి...."

"....పోయి...."

"....సంధ్య...."

"....వార్చి...."

"కిళ్ళీ...."

"నమిలి...."

"ఒఖ సిగరెట్టు...."

"మరి ఇపుడేగా కాఫీ త్రాగిందీ—మళ్ళీ కాఫీ గుళ్ళో కెందుకూ"

"తమరింత పసిగా మంద బెట్టారు—కాఫీ—ఒఠి పొగచూరు నీళ్ళు—ఎన్నిసార్లు చెప్పినా....పచ్చి....విషంలా కాయడం మా యింటికి....అనువాయితీ....అయింది...."

"ఎన్నిసార్లు చెప్పినా ఆ కాఫీ గింజలు తెచ్చి....నా రెక్కలు విరవటమే కాని కాఫీ బిళ్ళలు తెస్తే....ఇద్దరికీ మాట దక్కుతుందిగా"

".... .... .... ...."

"యివాళేం బాగాలేదూ కాఫీ"

".... .... .... ...."

"దివ్యంగా వుంటేనూ....ప్రతిదానికీ వంకలు పన్నడం.... రివాజు...."

"వంకలు పన్నకుండా శ్రద్ధగా జేస్తేగా"

"మాటకు మాట—అప్పజెప్పారు—పాపం"

".... .... .... ...."

"కాసిని లవంగాలు తెస్తాఁగా"

".... .... ...."

"అయిపోయాయి—తమలపాకులు కూడాను"

".... .... .... ...."

"ఇదిగో వచ్చేటప్పుడు—కాస్త మంచి సున్నం కూడా తేండి"

".... .... .... ...."

"మీ కాఫీ గింజలు తెచ్చుకోండి. ....అవి అయిపోయాయి"

"—ఇంకా ఏమన్నా...."

".... .... .... .."

"వెళుతున్నా—తలుపేసుకో—"

"మఱచి పోకండేం"

## 2

"మజ్జిగ యిట్లా వుందేం"

"మజ్జిక్కేమి"

".... .... ...."

"సిగరెట్ల నాలిక్కి రుచీ పచీ తెలుస్తేగా"

".... .... ...."

"కిళ్ళీమీదకిళ్ళీ వేసుకుని....వెధవసిగరెట్లవేడి పొగ త్రాగేవారికి...."

"....... ......."

"మజ్జిక్కేట.... వంకలు.........ట...."

"అయితే బాగున్నట్లేనా"

"బాగుందనేనా"

"ఏ జన్మానయినా—యింటిపాడి పెట్టిపుడితే....గా."

".... .... .... ...."

"చేశైనా ఉండాలి....చూసైనా ఉండాలి"

".... ... .... ...."

"అచ్చాలు తెచ్చేకుండ కడుగునీళ్ళు త్రాగే సజ్జుకు యింటి మజ్జిగ వెగటుకదూ."

".... .... ...."

"బాగాలేవంటే.... యింత.... చించుకున్నావే.... అందరికీ.... మీకు మల్లే.... పాడీ పంటా ఉంటేగా"

"ఆమాట నేనూ అన్నది."

"అంటే రభస చేస్తావుకాని....పులుసుమాత్రం మండింది"

"ఊహుఁ ఁ ఁ— అన్నారూ.... అనుకుంటూనేవున్నా.... ఉల్లిపాయలు.... పడలేదు. ఉడయవర్లకు.... అపచారం.... అయిందీ."

"చాల్చాలు.... నోరుమూసుకో.... "

"అంటచేతులండీ—"

"ఎదురు చెప్పడం మానదు....సిగ్గయినా ఉండాలి...."

"సిగ్గెందుకూ....ఉన్నమాట....అంటానికీ"

## 3

"తమలపాకులు తెచ్చారా"

".... .... ...."

"లవంగాలు"

".... ...."

"ఇదేం సడసమమ్మా—ఎవరు మురిసిన సడసం...."

"మహా.... తెలివి....వక్కలు.... ఏమనుకున్నారూ"

"నువ్వు చెప్పలేదు—ఉన్నయ్యనుకుని.... తేలేదు"

"అంతమాత్రం మొగాళ్ళకి తెలియవద్దూ"

"ఆడాళ్లు చెప్పవద్దూ"

"పోనీ.... మొగజాతి.... కాస్త యిల్లు చూడగూడదూ."

"ఈ ఆడజీవాలు కాస్త వంగి నడవకూడదూ"

"పోనీండి.... ఆకులకు సున్నం.... రాచాను...."

".... .... ...."

"రాత్రికి వేసుకుందురుగానీండి.... సాయంత్రం పాదుషావారు.... వక్కలు తెచ్చుకోండి."

"జోహుకుం.... బూబూజీ!"

".... .... ...."

"నేను కిళ్ళీ తెచ్చుకున్నాలే—"

"అల్లాగేం— మాబాబే— పాపం— కులుకుతున్నారు—నే యిందాకే చొక్కాజేబులోంచి తీసుకున్నాలెండి...."

"....ఎపుడూ యిదంతా...."

"యిందాక మజ్జిగపోసేటప్పుడు—"

"ఇంతకీ నా కిళ్ళీ.... నా కివ్వవూ"

"వక్కల పొట్లాం బైట పెట్టరూ."

"తేలేదుగా.... మరీ—"

"కిళ్ళీ నే వేసుకుంటాగా మరి...."

"యివ్వాళిటికి యివ్వవూ"

"యిపుడైనా వెళ్ళి వక్కలు తేరూ"

"పెంకి—ఘటం—వక్కలు.... పరుపు క్రింద ఉన్నవి...."

"మీ కోటు జేబులోఉంది—కిళ్ళీ—"

## 4

"మా అమ్మని చూడాలి....వెళ్లొద్దా"

".... .... .... ....

"మా అమ్మ చచ్చి బతికింది...."

".... .... .... ...."

"ఒక్క నాల్గు రోజులు...."

".... .... .... ...."

"మళ్ళీ ఆదివారంనాడు.... వొచ్చేస్తాగా...."

".... .... .... ...."

".... మిమ్మల్నే...."

".... .... .... ...."

"దొంగనిద్ర పోతారేమండీ"

".... .... .... ...."

".... .... .... ...."

"మహా నిద్రపోతున్నట్టు...."

"అబ్బే ! కళ్ళల్లో ఒత్తులు వేసుకొచ్చున్నా"

"ఏమండీ— వెళ్ళొద్దా—"

".... .... .... ...."

"మా అమ్మకూ మరి జబ్బుచేసిందటండీ"

".... .... .... ...."

"పోనీ మీరుకూడా:... రెణ్ణాళ్ళు సెలవెట్టరాదూ"

"వారం రోజులేగా.... నెల్లాళ్ళా ... వారాలా?"

"…. నే త్రాశ్రిళలేనే…."

"ఎం ఎత్తిపొడుపండీ…. ఎవరివాళ్ళకొస్తే…. వాళ్ళకి తెలుస్తుంది…."

"మావాళ్ళకు రాలేదేమనేగా…."

"యిటొస్తే…. బాధపడుతూ….యింకా అటుకూడా ఎందుకండీ."

"…. …. …. …."

"వెళ్ళొద్దండీ"

"తీరి కూర్చుని…. బావురుమంటా వెందుకు"

"…. …. …. …."

"దిగబెట్టి రావాలా?…. రైల్లో విజయం చేయగలరా…."

"మళ్ళీ రేపు రావచ్చును…. మీరు కూడా ….రారాదూ?"

"బజారు వెళ్ళొస్తాను…. సాయంత్రం బండికి…."

"ఫరవాలేదు…. మా యింటికి వైరు యివ్వకండేం"

"అల్లాగేలే"

"ఏవిటా ఉత్తరం…."

"…. …. …. …."

"ఎవరన్నా చూస్తారని ఉండొద్దూ"

"…. …. …. …."

"అడ్రస్— అల్లా — ఆఫీసుకు రాయకపోతేనేం—"

"ఉత్తరాలు వాడొచ్చేటప్పటికి యింట్లో ఉండరనుకున్నా"

"చాల్చాలు"

"ఎవరన్నా.... చూచారా.... ఉత్తరం—"

"ఊహూ‌౹౹౹— తెలివితేటలు—"

"…. …. …. …."

"చెంపలు గుర్తుకొస్తున్నాయనీ...."

"…. …. …. …."

"నిద్ర పట్టడం లేదనీ—"

"తోచడం లేదనీ.... అన్నం సయించడంలేదనీ—"

"…. …. …. …. "

"అల్లా రాయకపోతేనేం—"

"…. …. …. …."

"తోచేటట్లుగా ఎవరన్నా...."

"చాల్లెద్దురూ— మహా నేర్చారూ"

"ఆ ఉత్తరం— ఏమిటే—"

"అల్లా మీరు— రాయొచ్చేం—"

"....నిర్లజ్జీవ కులాంగనా—"

"చాల్లెద్దురూ— మహా నేర్చారు— అర్థం—"

"యిపుడు మళ్ళీ— మడి కట్టుకోవలసిందేగా"

"ఆ— హా"

"కారియరు తెప్పించరాదూ"

"పా— పం"

"వొస్తూనే— చెయ్యి కాల్చుకోవాలండీ—"